ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 25 మార్చి 2024



లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

మందమర్రిరూరల్, మార్చి 24: బ్రహ్మంగారి ఆలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ పూజారి కుషకుమార చారి, దేవాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 28న మధ్యాహ్నం 12.15 గంటలకు లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం, శనీశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని వారు పేర్కొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:29 సోమవారం
సహర్ | 4:53 మంగళవారం

ప్రధాని మోదీతోనే సుస్థిరపాలన సాధ్యం



వెల్గనూర్‌లో ప్రచారం చేస్తున్న రఘునాథ్, నాయకులు

దండేపల్లి, మార్చి 24: ప్రధాని నరేంద్రమోదీతోనే సుస్థిరపాలన సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపునకు వెల్గనూర్‌లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన అంతా అవినీతిమయంగా కొనసాగిందన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలకు మంచి పాలన అందించిన ఘనత మోదీయేదన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇవ్వడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, వెల్గనూర్ ఎంపీటీసీ చుంచు మల్లవ్వలక్ష్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ బెదుడ సురేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సంజీవ్, బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చుంచు గిరిధర్, ప్రధాన కార్యదర్శి ఎంబడి సురేందర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మట్టల ఆదివారం



దండేపల్లిలో మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

దండేపల్లి, మార్చి 24 : గుడ్ ఫ్రైడేకు ముందస్తుగా క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకునే మట్టల ఆదివారం వేడుకలను మండల చర్చి పాస్టర్స్‌ల ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లోని క్రైస్తవ సోదరులు పిల్లలు, మహిళలు, పెద్దలు, యువకులు, మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. యేసన్న జయం అంటూ కీస్తు పాటలు పాడుతూ మట్టలతో ఊరేగించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ చర్చి సభ్యులు, ఆయా గ్రామాల క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు

మహిళలపై దాడులను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి

భీమిని, మార్చి 24: మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం ఖర్జీభీంపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలందరు హక్కుల కోసం పోరాటాలు చేయాలన్నారు. మహిళలు ఇంటా, బయట వివక్షకు గురవుతున్నారని, లైంగిక దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. అయినా ప్రభుత్వాలు మహిళల రక్షణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, పార్వతి, స్వరూప, సుగుణ, కళావతి, పద్మ, లక్ష్మీ, పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

ఏసీసీ, మార్చి 24: పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోకల రాజేశం, ముత్యం నాగవర్మలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పున్నమి పూట రచయితల కదలిక అనే కార్యక్రమం కరోనా సమయంలో నిలిచిపోయిందని, తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చక్రవర్తుల శ్రీమాన్ రాసిన కారూన్ కథా పుస్తక సంపుటి పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సొంత భవనాలకు మోక్షమెప్పుడు..

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాలు
- అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు
- గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని వైనం
- ప్రస్తుత ప్రభుత్వంపైనే ఆశలు

ఏసీసీ, మార్చి 24 : ప్రాథమికోన్నత స్థాయి నుంచి మాధ్యమిక స్థాయి వరకు ఉచిత వసతితో విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలను నెలకొల్పుతూ నాణ్యమైన విద్యను అందిస్తోంది. అయితే వాటికి అవసరమైన భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. గురుకుల సొసైటీలు ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాంతంతో నిమిత్తం లేకుండా అద్దె భవనాలు లేదా ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల భవనాల్లో నడుస్తున్నాయి. గురుకుల విద్యాలయాల ఏర్పాటుకు 5 నుంచి 10 ఎకరాల స్థలం, విశాలమైన భవనం, ఆట స్థలం, అధ్యాపకుల నివాస సముదాయాలు, అన్ని అందులోనే అందుబాటులో ఉండాలి.

అద్దె భవనాల్లో అసౌకర్యాలు

జిల్లాలో సాంఘిక సంక్షేమ వెనకబడిన తరగతుల సంక్షేమ, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు దశాబ్దానికి పైగా అనేక చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 9 విద్యాలయాలను నెలకొల్పారు. వాటిలో చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లిలలో బాలికల విద్యాలయాలు, కోటపల్లి, జైపూర్, బెల్లంపల్లి, కాసిపేట, మంచిర్యాలలో బాలుర విద్యాలయాలున్నాయి. మందమర్రికి సంబంధించిన గురుకుల పాఠశాల రామకృష్ణాపూర్ లోని సింగరేణి ఓల్డ్ హైస్కూల్ భవనంలో కొనసాగుతుంది. కోటపల్లి, కాసిపేట, మంచిర్యాలలోని బాలుర విద్యాలయాలు, జూనియర్ కళాశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనం కోసం ప్రభుత్వం స్థలాన్ని గతంలోనే కేటాయించింది. మంచిర్యాల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను మందమర్రి మండల పరిధిలోని గద్దెరాగడిలో ఓ అపార్టుమెంట్‌లో నిర్వహిస్తున్నారు.



జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం

- మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాలు జిల్లాలో లక్షెట్టిపేట, మంచిర్యాల, తాండూర్, దండేపల్లిలో బాలుర విద్యాలయాలు ఉండగా లక్షెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, మంచిర్యాలలో బాలికల విద్యాలయాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 8 బీసీ గురుకుల విద్యాలయాలు ఉండగా వీటిలో లక్షెట్టిపేటలో మాత్రమే సొంత భవనం ఉంది. మంచిర్యాల బాలుర గురుకుల విద్యాలయాన్ని గుడిపేటలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. లక్షెట్టిపేటలోని బాలికల గురుకులం మినహాయించి మిగితా ఏడింటిలో ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. లక్షెట్టిపేట మినహాయించి మిగిలిన ఏడు గురుకులాలకు కనీసం భూసేకరణ కూడా జరగలేదు.
- మైనార్టీ గురుకులాల విద్యాలయాలు 3 నెలకొల్పారు. మంచిర్యాలలో బాలికల గురుకులం, జూనియర్ కళాశాల అద్దె భవనంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు కొనసాగుతుంది. చెన్నూరు బాలుర గురుకుల మైనార్టీ విద్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. బెల్లంపల్లిలో బాలికల మైనార్టీ పాఠశాల, కళాశాల అద్దె భవనంలో కొనసాగుతుండగా స్థలం కేటాయింపు జరిగినట్లు సమాచారం.

వసతులు లేక ఇబ్బందులు

తాత్కాలిక అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపార్టుమెంట్లు, కాంప్లెక్స్ భవనాల్లో ఇరుకైన గదుల్లో సరైన వెలుతురు, గాలి లేక విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అద్దె భవనాల్లో ఆటస్థలం లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం గురుకుల విద్యాసంస్థల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు ఎదురవుతున్నాయి. జిల్లాలోని అన్ని గురుకుల విద్యాలయాలకు స్థలాలు కేటాయించి సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు సాకారం అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా అద్దె భవనాల్లో గురుకుల విద్యాలయాలు నిర్వహించడం వల్ల అద్దెల రూపంలో కోట్లాది రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తోంది.

సొంత భవనాలకు నిధులు కేటాయించాలి
-మహేందర్‌రెడ్డి, అసిస్టెంట్ రీజనల్ కో ఆర్డినేటర్

గురుకుల విద్యాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. నిర్మాణాలు పూర్తి చేస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన గురుకుల విద్య అందుతుంది. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి భవనాలను నిర్మించాలి.

వైభవ్ జ్యూయల్లర్స్ ప్రారంభం

ఏసీసీ, మార్చి 24: మంచిర్యాల జిల్లా కేంద్రంలో వైభవ్ జ్యూయల్లర్స్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు తొగరు సుధాకర్, నల్ల వెంకటనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి కొనుగోలును అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికరత్నకుమారి గ్రంధి చేతుల మీదుగా కొనుగోలు చేశారు. వైభవ్ సంస్థల సీఎండీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అద్భుతమైన డిజైన్‌లతో 916 హాల్‌మార్క్, 22 క్యారెట్ బంగారం ధరల ఆభరణాలను ఇప్పుడు మంచిర్యాల, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వినియోగదారులకు మరుపురాని షాపింగ్ అనుభూతితో బంగారు ఆభరణాలు, సర్టిపై డైమండ్స్, వంద శాతం స్వచ్ఛత కలిగిన స్టెరిలింగ్ సిల్వర్ వస్తువులు, సాధారణ వెండి వస్తువులను అందించాలనే ఉద్దేశ్యంతో మంచిర్యాలలో 15వ షోరూం వైభవ్ జ్యూయల్లర్స్‌ను ప్రారంభించామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా సాధారణ బంగారు ఆభరణాలపై తరుగు కేవలం 9 శాతం మాత్రమే ఉంటుందని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీవోవో గొంట్ల రకాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిందూరి వెంకటేష్, ఎండీ అమరేంద్ర గ్రంధి, వైభవ్‌జువెల్లర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైభవ్ జువెల్లర్స్‌ని ప్రారంభిస్తున్న అతిథులు

శిశుమందిర్‌లో కవి సమ్మేళనం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ కవి ముత్యబోయిన మలయశ్రీ హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఒక కళావేదిక భవనాన్ని ప్రభుత్వం నిర్మించాలని కోరారు. కవి సమ్మేళనంలో పలువురు కవులు కవితలు వినిపించారు. కవులు సుగుణాకర్, సంతోష్, సత్తయ్య, సంతోష్ పాల్గొన్నారు.

నీటి కోసం మూగజీవి వ్యథ



భీమారం, మార్చి 24: ఎండల తీవ్రత పెరగడంతో నీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. దాహం తీర్చుకునేందుకు పాట్లు పడు తున్నాయి. నీటి తొట్టిలు లేకపోవడంతో చేతి పంపుల వద్ద, నల్లాల వద్ద నిల్వ ఉన్న నీటిని తాగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలో రోడ్డుపై ఉన్న నీటితో దాహార్తి తీర్చుకుంటున్న పశువును ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బెల్లంపల్లి, మార్చి 24: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్యలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ గడ్డం వంశీకి కేటాయించడం హర్షనీయమన్నారు. ఆయన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. కాకా కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేసిందన్నారు. నాతరి స్వామి, రాయలింగు, శ్యాం, జగన్, అన్వర్‌ఖాన్, కొమురయ్యమల్లేస్, రాజరత్నం, వెంకటస్వామి, లక్ష్మణ్, రాజలింగు, కిరణ్, రాజనర్సు, రాజేందర్, రాయమల్లు, పాల్గొన్నారు.



- నేడు హోలీ పర్వదినం
- రసాయన రంగులు హానికరం

నస్పూర్/దండేపల్లి, మార్చి 24: హోలీ వేడుకలకు ఊరు వాడ, పల్లె పట్టణం అంతా సిద్ధమైంది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా కులమతాలకు అతీతంగా ఆనందోత్సవాల మధ్య హోలీని జరుపుకోనున్నారు. ప్రకృతి సిద్ధమైన రంగులు వినియోగించి పండగను జరుపుకోవాలని సూచిస్తున్నారు. రెండు రోజుల ముందు నుంచే మార్కెట్‌లో రంగుల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ప్రకృతి సిద్ధమైన రంగులు చల్లుకుంటే చర్మ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. హోలీ సంబురాల్లో సహజ సిద్ధమైన రంగులను వాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. ఈ నెల 25న సోమవారం హోలీ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు సిద్ధమయ్యాయి.

పండుగ నేపథ్యం

హిరణ్యకశపుడి కొడుకైన ప్రహ్లాదుడు తండ్రి మాట కాదని శ్రీహరిని పూజిస్తాడు. అది నచ్చక హిరణ్యకశపుడు కొడుకును భయపెట్టాలని ప్రహ్లాదుడిని హోలికా అనే రాక్షసి కూర్చుండబెట్టి పెద్ద కట్టెల పొగుచేసి మంటలు పెడతాడు. ప్రహ్లాదుడు రక్షించమని శ్రీహరిని కోరడంతో హోలికా మంటల్లో కాలిపోతుంది. హోలికా చనిపోయే ముందు తనను క్షమించ మని వేడుకుంటోంది. యేటా హోలిక పేరిట హోలీ పండుగను జరుపు కుంటారని ప్రహ్లాదుడు వరమిస్తాడు. హోలీ పండగకు ముందు రోజు కామదహనం చేసి మరుసటి రోజు హోలీని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మరో కథనం ప్రకారం హోలీక అనే రాక్షసి చిన్న పిల్లలను మింగేది. కన్న బిడ్డలను కోల్పోయి గర్భశోకంతో తల్లిదండ్రులు దాడి చేయగా రాక్షసి మృతి చెందింది. దీంతో ఆనందోత్సావాలతో రంగులు చల్లుకుంటు పండగ జరుపుకుంటారు.

కృత్రిమ రంగులతో అనర్థాలు

కృత్రిమ రంగుల తయారీలో ఇంజన్ ఆయిల్, డీజిల్, యాసిడ్స్‌తో కూడిన ప్రమాదకరమైన వాటితో తయారు చేస్తారు. వీటి వలన క్యాన్సర్, అంధత్వం, కళ్ళు ఎర్రగా మారడం, ఆస్తమా, చర్మవ్యాధులు వచ్చే ప్రమా దం ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాపర్ సల్ఫేట్, లెడ్, అల్యూమినియం బ్రోమైడ్‌తో తయారు చేసిన రంగులతో కళ్ళు ఎర్రబడి మండడం, రక్తంలో కలువడంతో క్యాన్సర్, చర్మ వ్యాధులు కలిగే ప్రమాదం ఉంటుంది. క్రోమియం అయోడైడ్ కలిగిన కలర్‌తో ఊపిరితిత్తుల వ్యాధు లు వ్యాప్తి చెందుతాయని నిపుణులు చెబుతున్నారు.హోలీ జరుపుకున్న అనంతరం చెరువులు, నదులకు వెళ్ళి స్నానం చేస్తారు. శరీరానికి అంటిన రంగులను కడగడం వలన నీరు కలు షితంగా మారుతుంది. రంగుల్లో రసాయనాలు ఉన్నందున జలరాసులు మృత్యువాత పడడం, ఆ నీరు తాగిన పశువులు, పక్షులు అనారోగ్యాలకు గురవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రంగులు కలిపేందుకు మంచి నీటినే వాడాలి.
- శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరిస్తే రంగులు నేరుగా శరీరాన్ని తాకే అవకాశం ఉండదు.
- జుట్టుకు కొబ్బరినూనె రాసుకుంటే రంగులు అంతటా అంటకుండా ఉంటాయి.
- కోడిగుడ్డు కొట్టడం, బురద నీళ్ల చల్లడం వంటివి చేయకూడదు.
- హోలీ ఆడిన వెంటనే రంగులను కడిగేసు కోవాలి. మాయిశ్చరైజర్ ఆయిల్, సన్‌స్క్రీన్ రాసుకుంటే రంగుల ప్రభావం ఎక్కువగా ఉండదు.
- కాటన్ వస్త్రాలను వేసుకోవడం మంచిది.
- చర్మవ్యాధులు, అలర్జీ అస్తమాతో బాధ పడేవారు. గర్భిణులు, చిన్న పిల్లలు రంగులకు దూరంగా ఉండాలి.
- రంగులు కళ్లల్లో పడకుండా చూసుకోవాలి.
- చిన్నారులు చెరువులు బావుల దగ్గరికి వెళ్లకుండా తల్లిదండ్రులు గమనించాలి.

మార్కెట్‌లో సందడి

మంచిర్యాల కలెక్టరేట్: హోలీ పండగ సందర్భంగా మంచిర్యాల మార్కెట్‌లో సందడి నెలకొంది. మార్కెట్‌లో రంగుల దుకాణాలు వెలిశాయి. దీంతో చిన్నారులు, పెద్దలు రంగులు కొనుగోలు చేశారు. రంగుల కొనుగోళ్ల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

సహజ రంగుల వినియోగమే మేలు...



పారిజాత, మోదుగు పూలతోపాటు మరికొన్నింటిని ఉపయోగించి గతంలో సొంతంగా రంగులు తయారు చేసేవారు. ఔషధ గుణాలు ఉన్నందున చర్మానికి ఎంతో ఉపయోగకంగా ఉండేది. పసుపు, ఆకుపచ్చ, ఎరుపురంగు, ఆకులు, బెరల్లు, పువ్వులు వాడాలి. బీట్‌రూట్, కొత్తిమీర, పూదీన, గోరింటాకు, మోదుగు పూలు వాటిని ఎండబెట్టి పొడిచేసి నీళ్లలో కరిగించి వాడాలి. ఆరోగ్యానికి రక్షణతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుంది.

కిరాణ దుకాణంలో చోరీ

నెన్నెల, మార్చి 24: మండలంలోని కోనంపేట గ్రామంలో దుర్గం రాజారాం కిరాణ దుకాణంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం దుకాణం, ఇల్లు కలిసే ఉంటాయి. ఆదివారం ఉదయం దుకాణంలో కిటికీ తొలగించి ఉంది. వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని రాజారాం గ్రహించారు. దుకాణంలో రూ.30 వేల నగదుతో పాటు రెండు తులాల బంగారం, స్మార్ట్ ఫోన్ దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై ప్రసాద్‌లు పరిశీలించారు.

కేజీబీవీలో విద్యార్థులకు అస్వస్థత

చింతలమానేపల్లి, మార్చి 24: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఉదయం అల్పాహారంలో పూరీలు, మధ్యాహ్నం చికెన్ తినడంతో వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లారు. సుమారు పన్నెండు మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవిని వివరణ కోరగా విద్యార్థుల పరిస్థితి నిలకడగానే ఉందని, చికిత్స చేయించినట్లు ఆమె తెలిపారు.

ధర్మపురిలో కన్నుల పండువగా నృసింహుడి తెప్పోత్సవం

ధర్మపురి, మార్చి 24: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి(యోగ) తెప్ప, డోలోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం వేళలో ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం ఆలయం నుంచి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకువచ్చారు. స్వామి వారల సేవలను హంస రూపంలో గల నూతన వాహనం పైన ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణాలు చేయించగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్యగల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సాంప్రదాయ రీతిలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో స్వామివారల డోలోత్సవం జరిపారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా లోనికి ప్రవేశించి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించగా శోభిల్లింది. రాత్రి 10 గంటలవరకు ఉత్సవం కొనసాగింది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పలువురు ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉత్తరద్వారం గుండా లోనికి ప్రవేశించి, స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం మండల కార్యవర్గం



జాడి పోశం

కాసిపేట, మార్చి 24: అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా జాడి పోశంను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడిపోశం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దాసరి రాజయ్య, ఉపాధ్యక్షులుగా గోదార్ల శంకర్, గొడిసెల సురేందర్, రాంచందర్, ప్రధానకార్యదర్శిగా కిష్టయ్య, సహాయ కార్యదర్శిగా అగ్గి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా దుర్గం సుధాకర్, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా కొమ్ముల బాపు, మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా ముస్తాఫా, బీసీ సెల్ ఇన్‌చార్జిగా పెద్దపల్లి శంకర్, సాంస్కృతిక కమిటీ ఇన్‌చార్జిగా గొడిసెల బాపు, మండల కమిటీ సలహాదారులుగా దాగం మల్లేష్, పల్లె మల్లయ్య, రాంటెంకి వాసుదేవ్, నర్సింగం, తిరుపతి, శ్రీనివాస్, మండల కమిటీ ఇన్‌చార్జిగా బన్న లక్ష్మణ్ దాస్‌లను ఎన్నుకున్నారు.

ప్రేమ విఫలమై వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

కాసిపేట, మార్చి 24 : ప్రేమించిన వ్యక్తి మోసం చేసి మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధం కావడంతో జైనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న యునాని వైద్యురాలు ఉప్పులేటి ప్రియాంక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కుటుంబీకులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం సోమగూడెం చెందిన ప్రియాంక మూడేండ్ల క్రితం తిర్యాణి మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యురాలుగా పనిచేస్తుండగా డాక్టర్ హర్షవర్ధన్‌తో పరిచయం ప్రేమగా మారింది. హర్షవర్ధన్ వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న ప్రియాంక శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు తండ్రి ఉప్పులేటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాకా కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 24: దివంగత కాకా వెంకటస్వామి కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సొత్కు సుదర్శన్‌లు పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఓ బీజేపీ నాయకుడు కాకా కుటుంబాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి కాకా వెంకటస్వామి ఎంతగానో సేవలందించారన్నారు. ప్రజలకు సేవ చేసినందునే కాకా కుటుంబాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం వంశీవివేక్‌ను గెలిపించుకుంటామని పేర్కొన్నారు. నాయకులు నెరివెట్ల శ్రీనివాస్, గడ్డం రజనీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఏసీసీ, మార్చి 24: టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి ఆశయసాధన కోసం కృషి చేద్దామని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవేణు మాట్లాడుతూ వెంకటస్వామి జీవితమంతా సంఘం బలోపేతానికి కృషి చేశారన్నారు. కిరణ్, బారిక్‌రావు, వాజిద్‌ఆలీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీష్ బాబు నానమ్మ మృతి



ఆండాలమ్మ(ఫైల్)

కాగజ్‌నగర్, మార్చి 24: సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నానమ్మ ఆండాలమ్మ ఆదివారం మృతిచెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం తుదిశ్వాస విడిచింది. సోమవారం ఉదయం అంతక్రియలు నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో లారీ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్, మార్చి 24: ఎస్పీఎం యాజమాన్యం వ్యవహరిస్తున్న మొండివైఖరి నశించాలని కోరుతూ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్ష ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు కిషోర్‌బాబు మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం తమడిమాండ్లను ఏమాత్రం పరిష్కరించటం లేదన్నారు. మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. ఎస్పీఎం యాజమాన్య వైఖరి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఈ నిరాహార దీక్షను సీఐటీయూ నాయకులు, ఇతర పార్టీల నాయకులు సందర్శించి మద్దతు పలికారు.

ఎస్పీఎం అందరి సంక్షేమం కోసం పనిచేస్తుంది: జీఎం



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ గిరిధర్

కాగజ్‌నగర్, మార్చి 24: ఎస్పీఎం అందరి సంక్షేమం కోసం పని చేస్తుందని జనరల్ మేనేజర్ గిరిధర్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎస్పీఎం క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మిల్లు పునఃప్రారంభమైన అనంతరం కాగితం ఉత్పత్తి పుంజుకుందన్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2500కుటుంబాలతో పాటు పన్నులు చెల్లిస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న డిమాండ్లు అపరిష్కృతంగా ఉన్నట్టు తెలిపారు. పరిష్కరించే వాటి విషయంలో చర్చలు జరిపినట్టు తెలిపారు. ముడిసరుకు తెచ్చిన లారీ డ్రైవర్లపై దాడులు చేయటాన్ని ఎస్పీఎం యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. శాంతి మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ రమేష్ రావు, తుమ్మరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య



రేణుక(ఫైల్)


ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 24: ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామానికిచెందిన మోహర్లె రేణుక(19) ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం.. రేణుకకు కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన యువకుడితో ఈనెల 30న వివాహం జరుగనుంది. వివాహ వేడుకలకు తన పెదనాన్న నాందేవ్‌ను ఆహ్వానించగా తాను పెండ్లికి రానని పెండ్లి ఎలా జరుగుతుందో చుస్తానని అన్నాడు. దీంతో మనస్థాపానికి గురైన రేణుక ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి కుటుంబీకులకు తెలిపింది. దీంతో కుటుంబీకులు వెంటనే ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. తండ్రి హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

కాగజ్‌నగర్, మార్చి 24: కాగజ్‌నగర్ వెంటరమణ థియేటర్ సమీపంలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఎస్పీఎంకు ముడిసరుకు తెస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో స్తంభం వంగి పోయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

పెద్దయ్య ఆలయంపై ప్రభుత్వాల చిన్నచూపు

● వసతులు లేక భక్తుల ఇబ్బందులు ● పర్యావరణ ప్రాంతంగా అభివృద్ధి చేయాలని డిమాండ్





పెద్దయ్య గుట్ట, పెద్దయ్య స్వామిని దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

దండెపల్లి, మార్చి 24: కవ్వాల్ అభయారణ్యంలో ఉన్న పెద్దయ్య ఆలయం పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరాధరణకు గురవుతోంది. మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలోని గుట్టపై వెలిసిన ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు ఉండటంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆలయం వద్ద వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలినడకన గుట్ట వద్దకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. నాయకులు వసతులు కల్పిస్తామన్న హామీ ఆచరణకు నోచుకోవడం లేదు.

● పెద్దయ్య ఆలయ విశిష్టత

ఆలయం సమీపంలో సహజ సిద్ధంగా వెలిసిన కోనేరు ఉంది. అందులో ఎప్పుడు నీరు ఉంటుంది. మొదట కోనేరులో స్నానాలు చేసి, ఆలయాన్ని సందర్శిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ద్వాపర యుగంలో పెద్దయ్య గుట్టలో పాండవులు అరణ్య వాసం చేసినట్టుగా పురాణగాథల ద్వారా తెలుస్తోంది. పెద్దయ్య గుట్ట నుంచి లక్షెట్టిపేట మండలంలోని చిన్నయ్య దేవుని గుట్ట వరకు సొరంగ మార్గం ఏర్పాటు చేశారని పెద్దలు చెబుతారు. భక్తులు ముందుగా అక్కడ ఉన్న "గజ్జిబండ" వద్ద పూజలు చేస్తారు. భక్తులు తమ వెంట తెచ్చే బియ్యం, కోడిగుడ్లు, నగదును గజ్జిబండ వద్ద ఉంచి పూజలు చేసిన అనంతరం కాలినడకన వెళ్లి పెద్దయ్య దేవున్ని దర్శించుకోవడం ఆనవాయితీ.

● రైతుల కొంగు బంగారం పెద్దయ్య...

పెద్దయ్య గుట్ట దేవాలయం రైతుల కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచింది. వానాకాలం, యాసంగిలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి రైతులు ఆది, గురువారాల్లో పెద్దయ్య దేవున్ని దర్శనం కోసం వస్తారు. కోనేటిలోని నీరును తీర్థంగా భావించి ఇండ్లకు తీసుకవెళ్లడం ఆనవాయితీ. పెద్దయ్య దేవుని ఇల్లారి చిన్న కుటీరం మాదిరిగా ఉంటుంది. ఈ కుటిరంలో గిరిజనులు(నాయక్‌పోడ్) పూజారులుగా వ్యవహరిస్తారు. భక్తులు కోనేరులో స్నానం చేసి తడి బట్టలతో రాగానే పూజారి ఉరగోలతో కొట్టితే పెళ్లి కాని వారికి పెండ్లి అవుతుందని, సంతానంలేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఏ సీజన్‌లో ఏయే పంటలు పడుతాయో రైతులు ఆలయ పూజారులను అడిగి తెలుసుకోవడం విశేషం. ఆలయం సమీపంలో సుమారు 100 మీటర్ల ఎత్తయిన కొండను పూనకం వచ్చిన పూజారి కేవలం పది నిమిషాలలో ఎక్కిదిగడం పెద్దయ్య దేవుని మహి మగా చెబుతారు.

● ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దయ్య దేవున్ని ఆలయానికి రోడ్డు సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు కాలినడక సుమారు 4కిల్లో మీటర్ల నడవాల్సి ఉంటుంది. ఆలయం వరకు రోడ్డు, వసతులు కల్పించే విధంగా చూడాలని భక్తులు కోరుతున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

రంగులకు గిరాకీ

మందమర్రిటౌన్, మార్చి 24 : హోలీ రంగులకు గిరాకీ పెరిగింది. ఆదివారం మందమర్రి మార్కెట్ సెంటర్‌లో రంగులు కొనేందుకు ప్రజలు దుకాణాల వద్ద బారులు తీరారు. వివిధ రకాల రంగులు, రంగులు పోసే పరికరాలను కొనుగోలు చేశారు. అలాగే పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో సింగరేణి పారిశుధ్య కార్మికులు ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. రంగులు చల్లుకున్నారు. దుకాణాల వద్ద పండగ మామూళ్లు ఇవ్వాలని పాటలు పాడారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఏసీసీ, మార్చి 24: మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మరిశెట్టి గ్రీష్మసాయి(25) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ మహేందర్ తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేట్ చదువుతున్న గ్రీష్మసాయికి కొంత కాలంగా పెళ్లి సంబంధాలు కుదరడం లేదన్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోని గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కుటుంబీకులు గమనించి కిందకు దించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతురాలు తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోటపల్లి, మార్చి 24: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలుకరించుకుని విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడిగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు మల్లారెడ్డి, లక్ష్మణ్‌రావు, రమణరావు, శ్రీనివాస్, నీలేష్ కచ్‌వాల్, శ్రీనివాస్, విజయలక్ష్మీలను పూర్వ విద్యార్థులు సన్మానించారు.పూర్వ విద్యార్థులు కొంకటి సుందర్, రాజేష్, శంకర్, గోనె మోహన్‌రెడ్డి, శారద , సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మందమర్రిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మందమర్రిటౌన్, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ఆయా కాలనీల గుండా మార్కెట్ సెంటర్ వరకు కొనసాగింది. ఏసీపీ మాట్లాడుతూ ప్రజల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు ద్వారానే పాలన వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. ఓటర్లందరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దని తెలిపారు. ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు రవాణా చేసినా కఠినచర్యలు తీసుకొంటామన్నారు. రౌడీషీటర్లను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తున్నారని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కామదహనం



ఆసిఫాబాద్ బ్రాహ్మణవాడలో కామదహనం చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 24: జిల్లా కేంద్రంలోని పలుకాలనీల్లో ఆదివారం రాత్రి ప్రజలు భక్తి శ్రద్ధలతో కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణవాడ, పొట్టిశ్రీరాములు చౌక్, బజారువాడి, జన్కాపూర్, కంచుకోట, రాజంపేట, సందీప్‌నగర్, తదితర కాలనీల్లో ప్రజలు కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాముడి చుట్టూ ప్రదిక్షిణలు చేశారు. అలాగే కేశవనాథ స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఒజ్జల నరేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి డోలోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని ఆయాగ్రామాల్లో ఆదివారం కామదాహనం పండుగను ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా మండలంలో ఆదివాసీలు తమ సంప్రదాయం ప్రకారం హోలి పండుగలో భాగంగా మాతరి, మాతరల్ దహనం కార్యక్రమం నిర్వహించారు. మాతరి,మాతరల్‌కు ప్రత్యేకపూజలు చేసి దహనకార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా తమ దైవాలకు జంతుబలితో మొక్కులు చెల్లించుకున్నారు. మాతరి, మాతరల్ దేవతలకు నైవేద్యం సమర్పించారు. అందరు సుఖశాంతులతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలో కూడా కామదహనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జైనూర్ ఏఎంసీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఆత్రం ఆనంద్‌రావు, ఆత్రం గంగారాం, ఆత్రం సన్నాన్‌రావు, కనక శ్యాంరావు, కనక నాగోరావు, గోడం అమృత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలోని మారుమూల గ్రామాల్లో ఆదివారం హోలి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లో సంప్రదాయం ప్రకారం ప్రతిఒక్కరూ కుడకల్ని గ్రామపటేల్ వద్ద జమ చేస్తారు. వాటిని గ్రామ పరిసరంలో తీసుకెళ్ళి వృద్ధురాలు, వృద్ధుడు అను రెండు కట్టెలను తయారు చేసి వాటికి కుడుకలు, మోదుగ పూలు కట్టి రెండు కట్టెలకు మంటపెడ్తారు. ఇందులో మంటలతో కాలి కింద పడిన కట్టెను యువకులు సత్వరమే లేపి సమీప బావిలో వదిలిపెడ్తారు. ఇందులో భాగంగా పవర్‌గూడలో వృద్ధురాలు కట్టె కాలి కింద పడటంతో ఓ యువకుడు ఆ కట్టెను బావిలో వదిలిపెట్టాడు. అనగా ఈ ఏడాది వృద్ధురాలిలో చైతన్యం వచ్చిందని అర్థం. గ్రామంలో ప్రతి విషయంలోనూ ఆడవారిదే పైచేయి అన్నట్లు ఈ హోలి పండుగ సారాంశం. అనంతరం భారీగా జమ చేసిన కుడకలు బూరేలు తదితర తిండి సామగ్రిని ఏకం చేసి గ్రామంలోని యువకులు పెద్దలు కలిసి భోజనం చేశారు. అనంతరం యువకులు డోలు వాయిద్యాల మధ్య కబడ్డీ ఆడుతూ పండుగ చేసుకున్నారు. అదేవిధంగా మండలంలోని పట్నాపూర్, జామ్ని, పొలాస, జైనూర్, జంగాం, ఉసేగాం, పోచంలొద్ది, రాసిమెట్ట, డబోలి తదితర గ్రామాల్లోనూ హోలి పండుగను ఉల్లాసంగా జరుపుకున్నారు.



ఆసిఫాబాద్ కేశవనాథస్వామి ఆలయంలో స్వామివారికి డోలోత్సవం

దహెగాం: మండలకేంద్రంలో ఆదివారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పక్షం రోజులపాటు జాజిరి ఆడి ఆదివారం కామదహనం చేశారు. యువకులు ఒకరికికొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడాలేకుండా హోలీ సంబరాలు జరుపుకున్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలో ఆదివారం హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆది, సోమవారాల్లో పండుగ ఉండడంతో కొన్ని గ్రామాల్లో పండగను జరుపుకోగా మండలకేంద్రంతోపాటు మరికొన్ని గ్రామాల్లో సోమవారం పండుగ నిర్వహించుకోనున్నారు. కాగా పెద్దబండవాగులో కామదహనం నిర్వహించి పండుగ ఉత్సవాలను ప్రారంభించారు.

లింగాపూర్: మండలకేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో వారివారి సంప్రదాయాలను అనుసరించి ఆదివారం కామదహనం నిర్వహించారు. నేడు హోలీ జరుపుకోనున్నట్లు పేర్కొన్నారు.



సిర్పూర్(యు)లో కామదహనం చేస్తున్న ఆదివాసీలు



లింగాపూర్‌లో కామదహనం



జైనూరులో కామదహనం

టెట్ ఫీజులను వెంటనే తగ్గించాలి

ఆసిఫాబాద్, మార్చి 24: రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెట్‌కు గతంలో పేపర్-1కు రూ.200, పేపర్-2కు రూ.400 ఉండేది. ఈసారి రెండుపేపర్లకు రూ. 1600పెంచారన్నారు. దీంతో పేద, మధ్య తరగతి అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే పెంచిన పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు జాడి విలాస్, దుర్గం కోటేశ్వర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

'కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు'

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 24: ఇతర పార్టీలకు చెందిన స్థానిక నాయకులను కాంగ్రెస్‌పార్టీలో చేర్చుకోవద్దని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చరణ్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రె స్‌పార్టీ నాయకులు కార్యకర్తలపై కేసులు పెట్టిన కొంతమంది నాయకులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీలో చేరుతున్నారన్నారు. అలాంటి వారిపై అధిష్టానం దృష్టిపెట్టాలన్నారు. స్థానిక నాయకులకు తెలియకుండా ఇతరులను ఎవ్వరినీపార్టీలో చేర్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు వసంత్‌రావు, ముబీద్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

ఆనందకేళి హోలీ



- సహజ రంగులే మేలు
- అంబరాన్నంటనున్న సంబరాలు

బెజ్జూరు, మార్చి 24: హోలీ అంటే చాలు పిల్లలు, పెద్దలు ఎగిరి గంతేస్తారు. రంగులతో ఆడుకోవడం అంటే అందరికీ సరదానే. రంగులను ఒకరికి ఒకరు పూసుకో వడం, రంగునీళ్ల చల్లుకుంటూ ఆడుకో వడం, డీజే పాటలకు నృత్యాలు చేస్తుండటం ప్రతీ ఒక్కరికి సరదా. పండగవేళ రంగులను వ్యాపారులు విక్రయిస్తున్నారు. పిల్లల ఆనందాలను కాదనలేక తల్లిదండ్రులు పలురకాల రంగులను కొనిస్తారు. ఇందులో ప్రమాదకర రసాయనాలు న్నాయన్న విషయాన్ని గమనించాల్సి ఉంది. సహజరంగులను హోలీ పంబరాల్లో వాడటం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఉత్తర భారతంలో చాలాచోట్ల సహజ రంగులను ఎక్కువగా వాడుతుంటారు. పూలు, ఆకులు, పండ్లతో రంగులను తయారుచేసే ఓపిక, తీరిక లేని నేటి ఆదునిక కాలంలో రసాయన రంగులను విరివిగా ఉపయోగిస్తున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో మార్వాడీలు ఎక్కువగా ఉన్నారు. వారంతా ఈ పండుగను ఇష్టంగా జరుపుతారు. దేవుళ్లకు పూజలు చేసి రంగులు చల్లుకుంటారు. కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేస్తారు. పట్టణాల్లోనే కాకుం డా గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల డీజేలు పెట్టి రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేయడం పరిపాటిగా వస్తోంది.

ఇతరులకు ఇబ్బంది కలగకుండా..

మన ఆనందం ఇంకొకరికి ఆవేదన కలిగించ కూడదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యువకులు బైకులపై దూసు కొచ్చి పాదచారులు, వాహనదారులపై రంగులు చల్లుతున్నారు. దీనివల్ల ఖరీదైన వస్త్రాలు కరాబు కావ డంతో అనేక మంది ఆవేదన చెందుతున్నారు. స్నేహితులు, తెలిసినవాళ్లపై రంగులు చల్లితే ఎవ్వరూ తప్పుపట్టరు. కానీ రోడ్లపై రంగులతో విన్యాసాలు చేయకుండా నిరోధించాలి. పోలీసులు యువతలో అవగాహన కల్పించాల్సి ఉంది. అదే విధంగా ఈనెల 25న హోలీరోజున పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

రంగులు ఇలా..

పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో రకరకాల రంగు లను తయారు చేసుకొని హోలీ ఆడుకోవచ్చు. వీటితో ఎలాంటి హానీ జరగదు. దానిమ్మ, టమాటలతో ఎరుపు. మోదుగపూలు, క్యారట్‌తో ఆరెంజ్ రంగు, బీట్ రూట్‌తో ఊదారంగు, పాలకూర, కొత్తిమీరతో ఆకుపచ్చ రంగు, సహజ సిద్ధ పసుపు, కుంకుమలతో ఆయా రంగులు, బంతి, చామంతి పువ్వుల రంగును బట్టి ఆయా రంగులను సిద్ధం చేసుకోవచ్చు. వీటిని మరగబెట్టడం వల్ల మరింత గాఢత్వం సంతరించుకుంటాయి.

ఇలా చేద్దాం..

చర్మానికి రంగులు పట్టుకోకుండా ఆవాల నూనె కాని, పెట్రోలియం జెల్లీని కానీ బాగా పట్టించాలి. కళ్లలో రంగులు పడకుండా కంటి అద్దా లను వాడాలి. పొడవాటి చేతులు ఉన్న దుస్తులు ధరించాలి. మొటిమలు ఉన్నవారు రంగులు ముఖంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే ఈ సమస్య మరింత ఎక్కువై ఇబ్బంది పెడు తుంది. హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడు క్కోవాలి. లేకుంటే చేతివేళ్ల, గోర్ల నుంచి రంగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

రసాయన రంగులతో ప్రమాదం..

రంగుల్లో పాదరసం, సిలికా, మైకా, సీసం వంటి పలు రకాల రసాయనాలు ఉంటాయి. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాససంబంధ సమస్యలకు కారణం అవుతాయి. వాటర్ గన్, వాటర్ బెలూన్‌లతో హోలీ ఆడటం వల్ల చెవిలోకి రంగునీరు వెళ్లి దురద, చెవినొప్పి కలుగుతుంది. చెవిపొర దెబ్బతిని చెవిపోటు కలుగుతుంది. పొడిరంగులను చల్లినప్పుడు అవి గాలిలో కలిసిపోయి నోటిలోకి, శ్వాసనాళాల్లోకి పోయి శ్వాసకోశ సమస్యలు కలిగిస్తాయి. మనం గాలి పీల్చినప్పుడు ఈ రంగులు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి అక్కడే ఉండిపోయి దీర్ఘకాల సమస్యలను కలిగి స్తాయి. ఆస్తమా, ఎలర్జీ కలుగుతుంది. సింథటిక్ రంగులను వాడటం వల్లజలుబు, అలర్జీకలుగుతాయి. దురద, మంట, నొప్పి కలుగుతుంటాయి. కళ్లల్లోకి రంగులు పడినప్పుడు కళ్లమంట, దురదపెరుగు తుంది. కళ్లు ఎర్రగా మారుతాయి. గాఢమైన రంగులు పడినప్పుడు కంటిపొరలు దెబ్బతిని చూపు మందగించే అవకాశం ఉంది. రంగులు నోట్లోకి వెళితే వాంతులు, విరోచనాలు అవుతాయి. రసాయనాలు చర్మం గుండా శరీరంలోకి చేరుతాయి. దీంతో వికారం, వాంతులు, కడుపునొప్పి కలుగుతాయి.

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్

ఆసిఫాబాద్, మార్చి 24: నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్‌జైలులో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానన్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థచైర్మన్ మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్న వారు, న్యాయవాదిని నియమించుకోని స్థోమతలేని వారు, న్యాయ సేవా ధికార సంస్థనుంచి ఉచితన్యాయసహాయాన్ని పొందవచ్చన్నారు. బ్రహ్మకుమారి ఆర్తి ఖైదీలకు రాజయోగ మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణ దినోత్సవం


ఆశా వర్కర్లు, వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్ రూరల్,మార్చి 24: క్షయరహిత సమాజంకోసం ప్రతిఒక్కరు పాటుపడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తుకారాం భట్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయవ్యాధి ఎంత అపాయమో దాని లక్షణాలు ఎలా ఉంటాయో వాటిని ఎలా గుర్తించాలో ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్, కోఆర్డినేటర్ పవన్‌కుమార్, ప్రశాంత్, సంతోష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ దిగ్గజం సామల సదాశివ మాస్టారు

- ప్రముఖ కవి, రచయిత చెరుకు సత్యనారాయణరెడ్డి


చెరుకు సత్యనారాయణరెడ్డికి అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్, మార్చి 24: సాహితీ దిగ్గజం దివంగత సామల సదాశివ మాస్టారని ప్రముఖ కవి, రచయిత చెరుకు సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సామల సదాశివ సాహితీ పురస్కారం-2023 వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదాశివ మాస్టారు తెలుగు భాషా కవి, ఉర్దూ భాషాలో పట్టు ఉన్న ప్రావీణ్యుడన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావటం గొప్ప విషయమన్నారు. అంతటి మహానీయుడి పేరిట ఉన్న సాహితీఅవార్డు తనకు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. సాహితీవేత్త తాళ్లపెల్లి మురళీగౌడ్ మాట్లాడుతూ సదాశివ మాస్టారు తెలంగాణ సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన గొప్ప మహానుభావుడన్నారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచినట్టు తెలిపారు. ప్రముఖ కవులు పెండ్యాల కిషన్‌శర్మ, తుమ్మూరి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సదాశివ మాస్టారు రాసిన వ్యాసాలు ప్రతి పత్రికలోనూ ప్రచురితమైనట్టు తెలిపారు. కవి గురిజాల రవీందర్ మాట్లాడుతూ సదాశివ మాస్టారు ఇతర భాషా సాహిత్యాలను కూడా తెలుగుకు పరిచయటం చేసిన గొప్ప కవిగా వివరించారు. ఈ సందర్భంగా సామలసదాశివ సాహితీపురస్కారానికి ఎంపికైన ప్రముఖ కవి చెరుకు సత్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో తెలుగు సాహితీసదస్సు సభ్యులు, రాష్ట్ర స్థాయి కవులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ..

ప్రముఖ కవులు రచించిన పద్యకావ్యాలను ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ కవి పెండ్యాల కిషన్ శర్మ రచించిన సుందరకాండను ఆవిష్కరించారు. అలాగే కవి గురిజాల రవీందర్ రచించిన బొగ్గురవ్వలు పుస్తకావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిపారు. కార్యక్రమాల్లో సామల రాజవర్ధన్, సామల శ్రీవర్ధన్, సామల చంద్రశేఖర్, రామోజు లక్ష్మీరాజయ్య, రాజేంద్రప్రసాద్, మామిడాల తిరుపతయ్య, కటుకం మధూకర్, యూఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- ఖాళీ స్థలాల్లో రాత్రికి రాత్రే వెలుస్తున్న సిమెంటు స్తంభాలు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 24: కాగజ్‌నగర్ మండలంలో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన పాలకులు, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని చారిగాం, బోరిగాం ప్రాంతాల్లో ఈ దందాను కొంతమంది బ్రోకర్లు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తోంది. ప్రభుత్వ స్థలం ఖాళీగా కన్పిస్తే చాలు రాత్రికిరాత్రే సిమెంటు పోల్స్ పాతేస్తున్నారు. ఈలోగా ఎవరికి ముడుపులు ముట్టజెప్పాలో వారికి ముట్టజెపుతున్నారు. అనంతరం వారం రోజుల్లోనే షెడ్డు వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కోట్లాది విలువైన స్థలం కబ్జాకోరల్లో పోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జా విషయంలో ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సర్వేలు చేయాలంటున్నారు. ఎంత మంది కబ్జా చేశారు..? దీని వెనక ఎవరెవరు ఉన్నారు..? అనే విషయాలు నిగ్గు తేల్చాలని కోరుతున్నారు.

చారిగాం, బోరిగాం ఏరియాల్లో ఖాళీస్థలాల్లో విచ్చల విడిగా ఆక్రమణలు చేసి కబ్జాలు చేశారు. కొంతమంది ఏకంగా భవనాలు నిర్మించారు. ఇంత తతంగం జరుగుతున్నా కూడా అధికారులు వ్యవహరిస్తున్న ఉదాసీనతపై అంతా అనుమానులు వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ప్రధాన రోడ్డుపై యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. డబుల్ బెడ్ రూం నిర్మాణాల వద్ద పార్కింగ్ స్థలం కోసం వదిలేసిన స్థలాన్ని కూడా కబ్జా చేశారంటే పరిస్థితి ఏ మేరకు ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. ఈ దందాలో క్రింది స్థాయి నుంచి మొదలుకొంటే పైస్థాయి వరకు చేతులు తడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే కాగజ్‌నగర్ మండలం ఈసుగాం ఏజెన్సీ ఏరియాలో కూడా భవనాలు యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఏజెన్సీ ఏరియాలో భవంతుల నిర్మాణాలు చేపట్టరాదన్న స్పష్టమైన ఉత్తర్వులున్నప్పటికీ ఇంతవరకు అమలు కావటం లేదు. గిరిజనేతరులు పాగా వేసి యథేచ్ఛగా ప్లాట్ల దందాను కూడా చేస్తున్నారు.


డబుల్ బెడ్‌రూం సమీపంలో వెలసిన ఆక్రమణలు

ఉన్నతాధికారులు స్పందిస్తేనే..

కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో ప్రభుత్వభూములు ఎంత మేర ఉన్నాయి..? ప్రస్తుతం ఎంత ఆక్రమణలు చేశారు..? అనేకోణంలో ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తే తప్పా ఆక్రమణల పర్వానికి బ్రేక్‌పడే అవకాశాలు కన్పించటం లేదు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి దర్యాప్తు చేయించాలన్నారు. కాగజ్‌నగర్ మండలంలో ఆక్రమణలకు గురైన స్థలాలను తిరిగి ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని పలువురు డిమాండు చేస్తున్నారు.

సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం..

- కిరణ్ కుమార్, తహసీల్దార్, కాగజ్‌నగర్

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమాచారం అందిస్తే తప్పకుండా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులపై తాము స్పందించాం. పనులను నిలిపి వేయించాం. అలాగే సిమెంట్‌పోల్స్ కూడా తొలగిం చాం. కబ్జా జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలి: డీఎస్పీ


వాంకిడిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

వాంకిడి, మార్చి 24: రాబోయే పార్లమెంట్ ఎన్నికలసందర్భంగా ఎలాంటి వర్గభేదాలు లేకుండా, అల్లర్లు జరగకుండా ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ సదయ్య అన్నారు. ఆదివారం వాంకిడి మండల కేంద్రంలోని ప్రధానవీధుల గుండా పారామిలటరీ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్,ఎస్సై సాగర్, పోలీసులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు..

వాంకిడి:యువత,గ్రామప్రజలు మావోయిస్టులకు సహకరించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఎస్పీ సదయ్య అన్నారు. ఆదివారం వాంకిడిమండలంలోని వెల్గి, లక్ష్మీపూర్‌గ్రామాల్లో సీఆర్పీబలగాలతో గ్రామాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనప్రాంతాల్లో మావోయిస్టులు సంచరించే అవకాశం ఉందన్నారు. అపరిచితవ్యక్తుల మాయబాటలు నమ్మవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సహరించాలన్నారు. యువత మావోయిస్టులకు ఆకిర్షతులు కావద్దన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ వల్ల ప్రతి మారు మూల గిరిజనప్రాంతాల్లో పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర

కెరమెరి, మార్చి 24: మండలకేంద్రంలోని బాలాజీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివరాత్రినుంచి నిర్వహిస్తున్న జాతర ఆదివారంతో ముగిసింది. జాతరలో భక్తులుపెద్దసంఖ్యలో పాల్గొనగా కబడ్డీ,కుస్తీపోటీలు ఆకర్షనగా నిలిచాయి.



కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి


సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 24: సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మికులు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించి, వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన ప్రభుత్వంతో మాట్లాడి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జెట్టి శంకర్‌రావు, జాతీయసమితి సభ్యులు సీహెచ్ భీమ్‌రావు, కేంద్రకమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్ పాల్గొన్నారు.

కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోంది: హెచ్‌ఎంఎస్



విలేకరులతో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, మార్చి 24: ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ యూనియన్లతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందని హెచ్‌ఎంఎస్ రాష్ట్రఅధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రెండు యూనియన్లు పైరవీలు చేసుకుంటూ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఏరియాలో డిప్యూటేషన్ల దందా కొనసాగుతోందన్నారు. ఇటీవల నూతనంగా 20మందికిపైగా డిప్యూటేషన్‌పై వివిధ గనులకు పంపారని, దానికి కార్మికుల నుంచి అధికారులు, ఓ కార్మిక నాయకుడు లక్షల్లో డబ్బులు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతోమంది అర్హులు దరఖాస్తు పెట్టుకున్నా వాటిని తిరస్కరించడం దారుణమన్నారు. వివిధ గనులు, విభాగాలలో పనిచేసే మహిళా కార్మికులను పలువురు నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. అలాంటి వారు తమ పద్ధతులు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. మహిళా కార్మికులకు మహిళా సూపర్‌వైజర్లు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈపీ ఆపరేటర్లకు నిబంధనల పేరిట ఆంక్షలు పెట్టకుండా బదిలీలుచేయాలని, ఎస్‌అండ్‌పీసీ విభాగంలో పర్మనెంట్ ఉద్యోగులన రిక్రూట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జీవన్ జోయల్, ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్రకార్యదర్శి గోళ్ల సత్యనారాయణ, నాయకులు గోషికఅశోక్, గౌస్, బోనాల శ్రీనివాస్, ఎస్‌టిపిపి నాయకులు ప్రదీప్‌రెడ్డి, సాయిక్రిష్ణారెడ్డి, దుర్గం లక్ష్మణ్, కంచాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో 92 శాతం ఉత్పత్తి

మందమర్రిటౌన్, మార్చి 24: మందమర్రి ఏరియాకు 2023-24ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశించిన 46.10లక్షల టన్నులు నిర్ధేశించారు. దాదాపు ఏరియా ఉత్పత్తి లక్ష్యానికి కొద్ది దూరంలోనే ఉంది. ఇప్పటివరకు ఏరియాలో 42లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. కేవలం మరో 4లక్షల టన్నులు సాధిస్తే లక్ష్యం పూర్తి కానుంది. ఏరియాలోని కేకే5 గని ఇప్పటికే వంద శాతం ఉత్పత్తి సాధించింది. అదేవిధంగా ఆర్కే ఓసీపీ కూడా వందశాతం ఉత్పత్తి సాధించి ముందంజలో ఉంది. లక్ష్యానికి వారంరోజులు మాత్రమే ఉన్నందున ఆయా గనులకు నిర్ధేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. శాంతిఖని, కాసిపేట1,2గనులు, ఆర్కే 1ఏ గనులు లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నాయి. ఏరియా జీఎం మనోహర్ ఏరియా అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్పత్తి లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్నారు.

కార్మికుడిని పరామర్శించిన నాయకులు

బెల్లంపల్లి, మార్చి 24: ఎస్‌ఆర్పీ1 గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుడు సత్యనారాయణ కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం టీఎస్‌టీయూసీ నాయకులు మణిరాంసింగ్, ఏడుకొండులు, నారాయణ, చంద్రయ్య పరామర్శించారు. ఆరోగ్యం గురించి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుడు త్వరగా కోలుకునేలా సింగరేణి యాజమాన్యం మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.